
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

మే డేను విజయవంతం చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 29: మే ఒకటో తేదీ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోకాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చారు

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



తాండూరురూరల్, ఏప్రిల్ 29 : జినుగుర్తి ఆంజనేయస్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. సోమవారం ఆలయంలో ఉత్తంచంద్, కరంచంద్ దంపతులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అంతకుముందు ధ్వజస్తంభానికి గ్రామానికి చెందిన మహిళలు పూజలు చేసి నవధాన్యాలు సమర్పించారు. ఆవాహిత దేవతాపూజ, జలాధివాసం, పుష్పాధివాసం, హోమం, పూర్ణాహుతి తదితర పూజలు చేసి ప్రతిష్ఠించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో కరంచంద్, మోహన్‌దాస్, ఉత్తంచంద్, జగదాంబ, రఘుకిషోర్, మురళి, రాంలింగారెడ్డి, నారాయణరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, నరేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, శ్యామప్ప, శ్రీధర్‌గౌడ్, మహేష్, రాజు, బాలప్ప, శివకుమార్, నరేష్, భాస్కర్, యశ్వంత్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు



ధారూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- కేంద్రాలను పరిశీలించిన జిల్లా పౌరసరాఫరాల అధికారులు

ధారూరు, ఏప్రిల్ 29: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. గట్టేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ధాన్యం తేమశాతం, తూకాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గోనె సంచులు, హమాలీల కొరత లేకుండా చూడాలని, కేంద్రం వద్ద రైతులకు వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణబాయి, మార్కెటింగ్ శాఖ డీఎంవో సారంగపాణిలు ధారూరులో మార్కెట్ యార్డులో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వీరి వెంట ఆర్ఐ వీరేశం, పీఏసీఎస్ సీఈవోలు నర్సింహులు, రవి, ఎఈవో సంజూరాథోడ్, సిద్దమ్మ ఉన్నారు.



తాగునీటి సమస్యపై తెలుసుకుంటున్న సుబ్రహ్మణ్యం

దోమ, ఏప్రిల్ 29: 'తాగునీటి కోసం తండ్లాట' అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దోమ మండలంలోని ఊటుపల్లి తండాలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో తండావాసులు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ డీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహేశ్ బాబు, తండాలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్య గురించి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి లాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగింది. చేవెళ్ల ఎంపీ స్థానానికి మొత్తం 64 నామినేషన్లను దాఖలు కాగా 18 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో 43మంది బరిలో నిలిచారు. మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి 22 మంది బరిలో నిలిచారు. బరిలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులను కేటాయించారు.

- చేవెళ్ల సెగ్మెంట్‌లో ముగ్గురు అభ్యర్థులు విత్ డ్రా..
- బీఎస్పీ అభ్యర్థితో పాటు ఇద్దరు స్వతంత్రులు
- చేవెళ్ల పార్లమెంట్ బరిలో 43 మంది అభ్యర్థులు
- మల్కాజ్‌గిరి బరిలో 22 మంది ..
- అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న బీఎస్పీ అభ్యర్థి గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న చాంద్‌పాష, ఇమామ్

మల్కాజ్‌గిరి పార్లమెంటు బరిలో అభ్యర్థులు

క్ర.సం	అభ్యర్థి	పార్టీ
1	పట్నం సునీతారెడ్డి	కాంగ్రెస్
2	ఈటల రాజేందర్	బీజేపీ
3	రాగిడి లక్ష్మారెడ్డి	బీఆర్ఎస్
4	శీలం అనిత	బీఎస్పీ
5	కొండా అప్పారావు	ఆర్ఎస్‌పీపీ
6	చామకూర రాజయ్య	ఎస్‌జేపీఐ
7	జువ్వా ఫణికుమార్	జైబీఎస్‌పీ
8	పెద్దపల్లి సందీప్	బీయూడీ
9	బోయిన దుర్గాప్రసాద్ యాదవ్	డీఎస్‌పీ
10	నక్క యాదీశ్వర్	టీపీపీ
11	నర్రా సుఖేందర్‌రెడ్డి	వీఆర్‌పీ
12	కంటే సాయన్న	ఇండిపెండెంట్
13	చిరిపిరెడ్డి రమేష్	ఇండిపెండెంట్
14	దొంతుల బిక్షపతి	ఇండిపెండెంట్
15	పెసరికాయల పరీక్షిత్తురెడ్డి	ఇండిపెండెంట్
16	బంజపల్లి సుధారాణి	ఇండిపెండెంట్
17	మౌతం సంపత్	ఇండిపెండెంట్
18	రాజేష్ మిశ్రా	ఇండిపెండెంట్
19	తల్లాడ వెంకటేశ్వర్లు	ఇండిపెండెంట్
20	పెండ్యాల శేషసాయి వరప్రసాద్	ఇండిపెండెంట్.
21	భారత సుదర్శన్	ఇండిపెండెంట్
22	ఆర్.సుఖేందర్‌సింగ్	ఇండిపెండెంట్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/మేడ్చల్, ఏప్రిల్29 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ ముగిసింది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగింది. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరించిన విషయం తెలిసిందే. చేవెళ్ల ఎంపీ స్థానానికి మొత్తం 64 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈనెల 26వ తేదీన జరిగిన నామినేషన్ల పరిశీలనలో 18 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 46మంది అభ్యర్థులు నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి శశాంక ఆమోదించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండటంతో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలోనిలిచిన 43 మంది అభ్యర్థులకు సాధారణ పరిశీలకులు, రాజేందర్‌కుమార్ కటారియా అభ్యర్థుల సమక్షంలో గుర్తులను కేటాయించారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులు వీరే

స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసిన మహ్మద్ చాంద్‌పాష్, దూదేకుల ఇమామ్ హుస్సేన్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నామినేషన్ను ఉపసంహరించుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శశాంకకు విత్‌డ్రా ఫారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ రాజేందర్‌కుమార్ కటారియా, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొన్నారు.

మల్కాజ్‌గిరి బరిలో 22 మంది

మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానానికి 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్లుదాఖలు చేశారు. పరిశీలనలో 77 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. 37 మంది అభ్యర్థుల నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణ చివరిరోజు 15 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని వారికి ఎన్నికల అధికారి తెలిపారు. అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించినట్లు తెలిపారు.

మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారిపై సీఈఓకు ఫిర్యాదు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్‌పై సోమవారం నామినేషన్లు తిరస్కరణకు గురైన 77మంది అభ్యర్థులు సీఈఓ వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 77 మంది స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను పరిశీలనలో తిరస్కరించారు. దీంతో తిరస్కరణకు గురైన అభ్యర్థులు సీఈఓ వికాస్‌రాజ్‌ను కలిసి చిన్నచిన్న కారణాలతో తమ నామినేషన్‌లను తిరస్కరించారని ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అవసరమైతే తాము న్యాయపరంగా వెళతామని స్వతంత్ర అభ్యర్థులు తెలిపారు.

చేవెళ్ల బరిలో నిలిచిన అభ్యర్థులు

క్ర.సం	అభ్యర్థి	పార్టీ
1	కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్	బీఆర్ఎస్
2	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	బీజేపీ
3	డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి	కాంగ్రెస్
4	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి	ఏఐఎఫ్‌బీ
5	పి.గోవింద్	బీఎంపీబ
6	చింతలగారి వెంకటస్వామి	బీఐపీ
7	తోట్ల రాఘవేందర్ ముదిరాజ్	డీఎస్‌పీ
8	దుర్గాప్రసాద్. టి	పీవీపీ
9	నర్సింహారెడ్డి ద్యాప	టీఆర్‌పీ
10	పాలమాకుల మధు	ఐపీబీపీ
1	ఫణిప్రసాద్ కటకం	ఎస్‌జేపీఐ
12	మహ్మద్ అబ్దుల్‌ఖావి అబ్బాసి	ఏఐఎంఈఈఈఎం
13	మహ్మద్ సలీం	ఆర్‌పీసీ(సెక్యులర్)
14	మహ్మద్ షకీల్	దేశ్ జనహిత్ పార్టీ
15	జీవీ రమేష్ నాయుడు	సోషల్‌పార్టీ (ఇండియా)
16	రాములు బింగి	యుగ తులసి పార్టీ
17	రంజిత్‌రెడ్డి గాదె	ఆర్ఎస్‌పీ
18	శ్రీదేవి యం	ఏడీఆర్‌పీ
19	సానెం రాజుగౌడ్	ప్రజాఏక్తాపార్టీ
20	సుగురు శ్రీనివాస్	జైస్వరాజ్
21	సుధాకర్ వనం	ఎంసీపీఐయూ
22	సేరుబాయి వసంత్‌కుమార్	ఆర్ఎస్‌పీపీ
23	అమీర్ సాజిద్	ఇండిపెండెంట్
24	అంకగాల ప్రవీణ్‌కుమార్	ఇండిపెండెంట్
25	ఆంజనేయులు నీరటి	ఇండిపెండెంట్
26	ఈసరి సూర్యప్రకాశ్‌రెడ్డి	ఇండిపెండెంట్
27	కత్తుల యాదయ్య	ఇండిపెండెంట్
28	కావలి సుకుమార్	ఇండిపెండెంట్
29	కండికేకర్ శ్రీనివాస్	ఇండిపెండెంట్
30	గోనె శ్రీనివాస్‌రెడ్డి	ఇండిపెండెంట్
31	గోవింద్‌లాల్	ఇండిపెండెంట్
32	జనపాల దుర్గాప్రసాద్	ఇండిపెండెంట్
33	జలీల్ హైమద్	ఇండిపెండెంట్
34	వి.పాండు	ఇండిపెండెంట్
35	జి. మల్లేశంగౌడ్	ఇండిపెండెంట్
36	మహమ్మద్ ఇక్బాల్	ఇండిపెండెంట్
37	మహ్మద్ అఫ్సర్ ఖుద్దూస్	ఇండిపెండెంట్
38	మహ్మద్ అలీ	ఇండిపెండెంట్
39	మహ్మద్ పాషా	ఇండిపెండెంట్
40	మహమ్మద్ ముస్తాఫా రిజ్వాన్	ఇండిపెండెంట్
41	మహ్మద్ రియజుర్ రెహ్మాన్ షేక్	ఇండిపెండెంట్
42	విశ్వకర్మ సప్తగిరి	ఇండిపెండెంట్
43	సాహితీ దాసరి	ఇండిపెండెంట్

రూ. 50 లక్షలు పట్టివేత

- సీఎంఎస్ వాహనంలో తరలిస్తున్న రూ.34 లక్షలు, అంతారంలో 10లక్షలు, మోకిలలో 15లక్షలు



పట్టుకున్న డబ్బును చూపుతున్న అన్వేష్‌రెడ్డి

కొత్తూర్/శంకర్‌పల్లి/కులకచర్ల :పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొత్తూర్ ఎస్‌బీఐ నుంచి సీఎంఎస్ వాహనంలో తరలిస్తున్నరూ.34లక్షల రుపాయల నగదును ఎస్‌వోటీ పోలీసుల సూచన మేరకు ఎఫ్ఎస్‌టీ టీం పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు. కొత్తూర్ సమీపంలో వాహనాలు తనిఖీలు నిర్వస్తుండగా, అటుగా వచ్చిన సీఎంఎస్ వాహనాన్ని తనిఖీ నిర్వహించగా డబ్బులు బయటపడ్డాయని తెలిపారు. డబ్బుకు సంబంధించిన రశీదులో వాహనం నెంబర్ ఒకటి ఉండగా, మరో వాహనంలో డబ్బు తరలిస్తున్నారని తెలిపారు. దాంతో అనుమానం వచ్చి డబ్బును సీజ్ చేసి గ్రీవియెన్స్‌కు తరలించామని ఎస్ఐ జి. శ్రీనివాస్‌తెలిపారు.

అంతారంలో రూ.10లక్షలు

వికారాబాద్‌జిల్లా కులకచర్ల మండల పరిధి అంతారం చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. కులకచర్ల నుంచి నంచర్ల వైపు వెళ్తున్న కారులో నగదు రూ.10 లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేశారు. పట్టుబడిన డబ్బులు పాలమూరు జిల్లా గండీడ్‌కు చెందిన అభినవ్‌రెడ్డివిగా గుర్తించినట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.

రూ.15లక్షలు పట్టుకున్న ఎస్‌వోటీ పోలీసులు

శంకర్‌పల్లి మండలం మోకిల పరిధి కొల్లూరు గేట్‌వద్ద భారీగా నగదు పట్టుబడింది. సోమవారం ఎస్‌ఓటీ పోలీసులు వాహనాలను తనిఖీ చేసి ఓ కారులో రూ.15లక్షలు పట్టుకున్నారు. నగదును, కారును మోకిల పోలీస్‌లకు అప్పగించారు. మొత్తాన్ని ఎన్నికల అధికారులకు అప్పగించారు.



శుభకార్యాలకు బ్రేక్!

- ఏప్రిల్ 29నుంచి ఆగస్టు 8వరకు మూఢాలు, ఆషాఢం
- ఈ కాలంలో ముహూర్తాలు లేవంటున్న వేద పండితులు
- అప్పటివరకు పెళ్లిళ్లు సహా ఇతర శుభకార్యాలకు సెలవు
- చిరువ్యాపారుల ఉపాధికి గండి, తగ్గనున్న పెళ్లిళ్ల షాపింగ్స్ సేల్స్

రంగారెడ్డి అర్బన్/కీసరరూరల్, ఏప్రిల్ 29 : ఎండాకాలం వచ్చిందంటే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలతో పట్టణాలు, పల్లెలు కోలాహలంగా సందడి వాతావరణం నెలకొంటుంది. ఎండాకాలంలో విద్యాసంస్థలకు సెలవులు.. కొంతమంది ఉద్యోగస్తులు ప్రత్యేక సెలవులు తీసుకుని శుభకార్యాలకు వెళుతుంటారు. ఈ కాలంలో ఫంక్షన్‌హాల్స్ మొత్తం బిజీగా మారిపోతాయి. అలాంటిది సోమవారం నుంచి మూడు నెలల వరకు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు బ్రేక్ పడింది. వచ్చే మూడు నెలలపాటు శుభ ముహూర్తాలు ఏమీ లేకపోవడమే అందుకు కారణమని వేద పండితులు అంటున్నారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 8వరకు మూడు నెలలపాటు వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో గురు, శుక్ర మౌఢ్యమి వల్ల సుముహూర్తాలు ఉండవని వివరిస్తున్నారు. దీనివల్ల వివాహాలతో పాటు నూతన గృహ ప్రవేశాలు, దేవతా విగ్రహ ప్రతిష్ఠాపనలు, శంకుస్థాపనల లాంటి శుభకార్యాలను జరపడం సాధ్యం కాదని తెలియజేస్తున్నారు. వేద పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 28 చైత్ర బహుళ చవితి ఆది వారం నుంచి జూలై 8 ఆషాఢ శుద్ధ తదియ సోమవారం వరకు శుక్ర మౌఢ్యమి ఉంది. అలాగే గురు మౌఢ్యమి మే 7 చైత్ర బహుళ చతుర్దశి మంగళవారం నుంచి జూన్ 7 జ్యేష్ఠ శుక్ల పాడ్యమి గురువారం వరకు కొనసాగనుంది. గురు, శుక్ర మూఢాల్లో నూతన శుభకార్యక్రమాలు చేయడం మంచిది కాదని పండితులు సూచిస్తున్నారు. ఇక జూలై 6 నుంచి ఆగస్టు 4 వరకు ఆషాఢ మాసం ఉండటంతో ఎలాగూ పెళ్లిళ్ల సహా ఇతర శుభకార్యాలు నిర్వహించడం సాధ్యంకాదని స్పష్టం చేశారు.

తగ్గనున్న వ్యాపారాలు

మూఢాలు, ఆషాఢ మాసం వల్ల శుభకార్యాలకు బ్రేక్ పడటంతో పూలు, పండ్లు లాంటివి అమ్ముతూ జీవనం సాగించే చిరు వ్యాపారుల ఉపాధిపై ప్రభావం చూపనుంది. అలాగే బాజా భజంత్రీలు, డప్పు వాయిద్యాలు, డీజేలు, బారాత్‌లు నిర్వహించే కళాకారుల ఉపాధికి మూడు నెలలపాటు గండిపడనుంది. నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాల కొనుగోళ్లు మందగించనున్నాయి. ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు ఆశించిన గిరాకీ లేక ఉసూరుమనే పరిస్థితి నెలకొంది.

మూడు నెలల వరకు మాకు పనిలేదు

మూడు నెలల వరకు మాకు పనిలేదు. మూఢాలు ఉన్నాయి. ఆగస్టు ఆరు నుంచి తిరిగి మంచి రోజులు రానున్నాయి. ఈ మూడు నెలలు తద్దినాలు, వంటి అశుభ కార్యాలు చేసుకోవాల్సిందే. దేవాలయ వార్షికోత్సవాలు వంటివి చేసుకోవాలి.



శ్రీపాదచారి,
చేవెళ్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి అలయ పూజారి

మెయింట్‌నెన్స్ చార్జీలు కూడా రావు



మూడు నెలల వరకు మంచి రోజులు లేవు. శుభకార్యాలు ఏమీ జరగవు. మూడు నెలలు పంక్షన్‌హాల్ ఖాళీగా ఉంటది. నెలకు 20 వేల చొప్పున 60 వేల పైచిలుకు నష్టం వస్తది. మెయింట్‌నెన్స్ చార్జీలు కూడా రావు.

భాను చందర్ గుప్తా,
బాలాజీ పంక్షన్‌హాల్
చేవెళ్ల



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

- మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ ఏప్రిల్ 29 : పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్, జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంకశుక్లాలు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్‌సింగ్, వ్యయపరిశీలకులు ధృవ్‌భోళా, మనోజ్‌అలోస్ లక్రాలు రాజకీ య పార్టీల నాయకులకు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా ఎన్నికల విధి విధానాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్కాడ్ టీములు పర్యవేక్షణ చేస్తుంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం , ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయండ సంబంధిత అభ్యర్థి ప్రచార ఖర్చులో వాటిని లెక్కించడ జరుగుతుందన్నారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ పరిశీలకులు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నియమనిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పార్టీల అభ్యర్థులు నడుచుకోవాలన్నారు. పార్టీలు అభ్యర్థులు ముందస్తుగా సువిధ యాప్ ద్వారా అనుమతులు తీసుకుని సమావేశాలు, ర్యాలీలు తీసుకుని నిర్వహించాలన్నారు. కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ముద్రించినట్లు ప్రింటర్ , ప్రచురణ కర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. సువిధ యాప్ యాప్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల అభ్యర్థులు పాల్గొన్నారు.

'స్వలాభం కోసమే పార్టీ మారారు'

నవాబుపేట, ఏప్రిల్ 29: స్వలాభం కోసమే గేట్‌వనంపల్లి, కడిచర్ల, మాదారం, మూలమాడ గ్రామాల బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు బీజేపీలో చేరారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోఓ ఎమ్మెల్యే కాలే యాదయ్య ద్వారా అనేక ప్రయోజనాలు పొంది విశ్వాసఘాతకులుగా మారారని విమర్శించారు. ఈ సమావేశంలో దాదా పూర్ మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జాతరకు నంబి గురుస్వామి ఆలయం ముస్తాబు

నవాబుపేట, ఏప్రిల్ 29: తిమ్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న నంబి గురుస్వామి జాతరకు ముస్తాబైంది. ఉత్సవాలు త్వరలోనే ప్రారంభం కానుండటంతో ఆలయ పరిసరాల్లో పనులు చేపట్టారు. ఆలయానికి రంగులతో ముస్తాబు చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో మట్టితో చదును చేశారు.

నేటితో వాహనాల పన్ను బకాయిల చెల్లింపు గడువు పూర్తి

- రేపటి నుంచి 200 శాతం అపరాధ రుసుము
- జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి



వికారాబాద్, ఏప్రిల్ 29: వాహనాల పన్ను బకాయిలను ఏప్రిల్ 30లోగా చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక పన్ను బకాయి చెల్లింపు వాహనాలకు ఏప్రిల్ 30తేదీతో గడువు ముగుస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని వాహనాల చెల్లింపులు మీసేవలో గానీ ఆన్‌లైన్‌లో గానీ చెల్లించవచ్చని ఆయన అన్నారు. గడువు పూర్తయి పన్ను బకాయి చెల్లించని వాహనాలకు 200 శాతం అపరాధ రుసుము విధించబడుతుందని, పన్ను బకాయి చెల్లించని వాహనాలను మే 1వ తేదీ నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి రుసుము చెల్లించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో సుమారుగా 5వేల వాహనాలకు సుమారుగా రూ.2కోట్ల వరకు పన్ను బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. పన్ను బకాయిలు చెల్లించని వాటిలో ఎక్కువగా ట్రాక్టర్, ట్రైలర్‌లు, భారీ వాహనాలు, మధ్య, చిన్న వాహనాలు, హార్వెస్టర్, రింగ్ మౌంటెడ్ వాహనాలు, స్కూల్ బస్సులు, సీసీ బస్సులు ఉన్నాయని ఆయన వివరించారు. ఈ వాహనాల యాజమానులు గడువులోగా పన్ను చెల్లించాలన్నారు. ఏదైనా సమాచారం కొరకు ఫోన్‌నెంబర్ 9848528441ను సంప్రదించాలని సూచించారు.

ఆరు గ్యారెంటీలకు నేను గ్యారంటీ

- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్/ఏప్రిల్ 29: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపీ పనిచేశానని, ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీగా పోటీలో ఉన్నానని.. తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఇందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. చేవెళ్ల నేత భీంభరత్ అధ్వర్యంలో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ గ్రామాల్లో సోమవారం రోడ్డుషో నిర్వహించారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని, చేవెళ్ల నియోజకవర్గంలో ఆరు గ్యారంటీల అమలుచేసే గ్యారంటీ తనదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరిసతీష్, షాబాద్ దర్శన్, మాణెయ్య పాల్గొన్నారు. పెద్దమంగళారంలోనూ పర్యటించారు. అనంతరం మొయినాబాద్‌లోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని రంజిత్‌రెడ్డి అన్నారు. కేతిరెడ్డిపల్లి ఎంపీటీసీ రెడ్డిమోని అర్చనయాదయ్య, నాగిరెడ్డిగూడ ఎంపీటీసీ అర్జున్, బీజేపీ నాయకుడు హన్మంత్‌యాదవ్, మరో వంద మంది కాంగ్రెస్‌లో చేరారు.



మొయినాబాద్ రూరల్: హిమాయత్‌నగర్ రోడ్డుషోలో మాట్లాడుతూన్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారు: అసెంబ్లీ స్పీకర్

ధారూరు: బీజేపీ ఓటేసి గెలిపిస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా ధారూరులో సోమవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. కాగా కోట్‌పల్లి ప్రాజెక్టు క్రాస్ రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

పరిగి/పూడూరు/ధారూరు/చేవెళ్ల/కందుకూరు, ఏప్రిల్ 29:కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని ఇబ్రహింపూర్, గడిసింగాపూర్, సోండేపూర్, జిడిగడ్డ, రంగంపల్లి, పరిగి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, కె.కృష్ణారెడ్డి, బి.పరుశరాంరెడి పాల్గొన్నారు. అదేవిధంగా రంజిరెడ్డిని ఆశీర్వదించాలని టీటీడీ బోర్డు మెంబర్ జి.సీతారంజిత్‌రెడ్డి సోమవారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, టీఆర్ఆర్ సతీమణి టి.ఉమారెడ్డిలతో కలిసి పరిగి మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని అభ్యర్థించారు. పూడూరు మండలంలోని కెరవెళ్లిలో రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటయ్య ఆధ్వర్యంలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధి కూలీలను కోరారు. ధారూరులో కాంగ్రెస్ నాయకులు బుజ్జయ్య గౌడ్, అమరేశ్వర్, బాబాఖాన్, మల్లేశం, ముజఫర్ ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. అదేవిధంగా చేవెళ్లలోని కమ్మెటలో చేవెళ్ల జడ్పీటీసీ ఎం.మాలతికృష్ణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి కమ్మెటలో ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా చేవెళ్ల జడ్పీటీసీ ఎం.మాలతికృష్ణరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. దెబ్బడగూడకు చెందిన 40మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డిలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు

ఎన్నికల కో-ఇన్‌చార్జిగా డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపామున్షీ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకర్గం ఎన్నికల కో-ఇన్‌చార్జిగా పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇన్‌చార్జిగా ఇప్పటికే వేం నరేందర్‌రెడ్డి ఉండగా కోఇన్‌చార్జిగా రామ్మోహన్‌రెడ్డి వ్యవహరించనున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ఇన్‌చార్జిగా రవి

మోమిన్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మోమిన్‌పేట్ మండల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా సోమారపు రవికి బాధ్యతలు అప్పగించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశంలో సోమారపు రవికి పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో కాంగ్రెస్ ప్రచారం

రాజేంద్రనగర్/పహాడిషరీఫ్/హైదర్‌నగర్/చందానగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. రాజేంద్రనగర్, బుద్వేల్, మాణిక్యమ్మ కాలనీ, లక్ష్మీగూడ వాంబే కాలనీ, గణేశ్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో సీనియర్ నాయకులు సానెం శ్రీనివాస్‌గౌడ్, కోరని బాల్‌రాజ్‌ల సమక్షంలో వేర్వేరుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని జల్పల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫర్హానా యూసుఫ్ పటేల్ కోరారు. వర్గంజల్‌పల్లి పరిధి షాహిన్‌నగర్‌లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రచారం చేశారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిరియాల రాఘవరావు, ఆయన తనయుడు ప్రీతం చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సీఎం రేవంతర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

- ఎన్నికల పరిశీలకులు ప్రియాంక శుక్లా

కీసర, ఏప్రిల్ 29: ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని మేడ్చల్ మాల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ ఎన్నికల పరిశీలకులు ప్రియాంక శుక్లా అన్నారు. ఈ మేరకు మేడ్చల్ మాల్కాజ్‌గిరి పార్లమెంట్ సెగ్మెంట్‌కు సంబంధించి భోగారంలోని ఈవీఎంలు భద్రపరిచే హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలను ప్రియాంక శుక్లా సోమవారం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. మేడ్చల్ మాల్కాజ్‌గిరి సెగ్మెంట్ మేడ్చల్, మాల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్‌ల ఈవీఎంలు భద్రపరిచే చోట పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ఉన్నత, రిటర్నింగ్ అధికారులు జారీచేసిన గుర్తింపు కార్డు లేనిది ఎవరినీ లోపలికి అనుమతించవద్దన్నారు. అదేవిధంగా నియమ, నిబంధనల ప్రకారం అభ్యర్థి, అతడితో పాటు పరిమితి సంఖ్యల్లో ఓట్ల లెక్కింపు రోజు అనుమతించాలన్నారు. ఈ సందర్భంగా భద్రతాపరంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కీసర తహసీల్దార్ అశోక్ పాల్గొన్నారు.


కీసరలోని హోలీమేరీ కళాశాలను సందర్శించిన ప్రియాంక శుక్లా, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఆయిల్‌పామ్ తోట పరిశీలన

యాచారం, ఏప్రిల్ 29: ఆయిల్‌పాం తోటలను పెంచి రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యావన అధికారులు నీరజగాంధీ, సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం చింతపట్ల, మాల్, నందివనపర్తి గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి పెంపకంపై రైతులకు సూచనలు చేశారు. ఆకు కూరలు, కూరగాయలు, ఆయిల్‌పామ్‌లో అంతర పంటలుగా సాగుచేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ మొక్కలకు జనుము, వర్మికంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు. మొక్కల పెంపకంపై ఏమైనా సమాచారం కావాలంటే రైతులు 87126636491 నబర్‌లో సంప్రదించాలని చెప్పారు. వారితో డివిజనల్ అధికారి కనకలక్ష్మి ఉన్నారు,


ఆయిల్ పామ్ చెట్టును పరిశీలిస్తున్న నీరజగాంధీ, సంజయ్‌కుమార్

ముగిసిన మిస్ గుజరాతీ తెలంగాణ-2024 వేడుక

శంషాబాద్, ఏప్రిల్ 29: శంషాబాద్‌లోని డిసూరి ఎరీనా కన్వెన్షన్‌లో మిస్ గుజరాతీ తెలంగాణ వేడుకలు సోమవారం రాత్రి ముగిశాయి. మిస్ గుజరాతీ తెలంగాణ-2024 విన్నర్‌గా విధి ఉదేశి నిలిచారు. ఫస్ట్ రన్నరప్‌గా కాంచన్ సంపత్, సెకండ్ రన్నరప్‌గా క్రీమాగాంధీ ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. గుజరాతీల కోసం 2023 డిసెంబర్ 3 నుంచి వివిధ స్థాయిల్లో 147రోజుల పాటు జరిగిన ఈ అతిపెద్ద ఈవెంట్‌లో తెలంగాణలో నివాసం ఉంటున్న గుజరాతీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. 21మంది ఫైనలిస్టులు ర్యాంప్ వాక్ చేశారు. మిసెస్ గుజరాతీ(40యేళ్లలోపు) ఈవెంట్‌లో 12 మంది ఫైనలిస్టులు పాల్గొన్నారు. శ్రీమతి గుజరాతీ తెలంగాణ-2024 విజేతగా భూమి కేతన్‌షా, ఫస్ట్ రన్నరప్‌గా కాంచన్‌సంపత్, సెకండ్ రన్నరప్‌గా జ్యోతిపరేఖ్‌లు నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు.



మిస్ గుజరాతీ తెలంగాణ-2024 విజేతలు

డీఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో వ్యక్తి హల్‌చల్

- న్యాయం చేయాలంటూ డిమాండ్
- అడ్డుకున్న పోలీసులు

వికారాబాద్, ఏప్రిల్ 29: తమకు న్యాయం చేయాలని ఓవ్యక్తి డీఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో హల్‌చల్ చేశాడు. ఈ ఘటన సోమవారం కలకలం రేపింది. ధారూరు మండలం హరిదాసుపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్ అనే వ్యక్తి ఏప్రిల్ 1న ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా అతడి మృతికి కారణమైన రాజేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఎంపీవోలపై చర్యలు తీసుకోవాలని సుదర్శన్ కుమారుడు రాజు డిమాండ్ చేస్తున్నాడు. ఈ విషయమై డీఎస్పీ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించాడు. దీంతో చేసేదిలేక రాజు డీఎస్పీ కార్యాలయానికి పెట్రోల్ డబ్బాతో చేరుకున్నాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని హల్‌చల్ సృష్టించాడు. వెంటనే గుర్తించిన పోలీసు సిబ్బంది అతన్ని అడ్డుకుని పెట్రోల్ డబ్బాను లాక్కుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


పెట్రోల్ పోసుకున్న రాజు

కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

బషీరాబాద్, ఏప్రిల్ 29: ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించిన కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసోవద్దని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అన్నారు. సోమవారం బషీరాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొని నీళ్లపల్లి, మైల్వార్, దామర్‌చెడ్, బషీరాబాద్, జీవన్గి గ్రామాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారంటీ పథకాల పేరిట హామీలిచ్చిన కాంగ్రెస్ ఒకటి కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ వైస్ ఎంపీపీ జడల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌ డ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు అశోక్‌గౌతం చంద్ర, పి.నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రథోడ్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం తనిఖీ

కేశంపేట, ఏప్రిల్ 29 : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వాహనాన్ని సోమవారం ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. కోనాయపల్లిలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ముగించుకొని ఎమ్మెల్యే వాహనంలో హైదరాబాద్ వెళ్తుండగా కొనాయపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీలో డబ్బులేమీ పట్టుపడలేదు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

వికారాబాద్, ఏప్రిల్ 29: మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి కె.హనుమంత్ రావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 10 శిక్షణ శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో ఐదు శిక్షణ శిబిరాలు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల కేటాయించినట్లు తెలిపారు.. వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు కలెక్టర్, చైర్‌పర్సన్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి అనుమతితో క్రీడాశిక్షణలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాల్లో కోచింగ్ నిర్వాహకులకు 4వేల గౌరవ వేతనంతో పాటు స్పోర్ట్స్ మెటీరియల్, క్యాంప్స్ ముగిసిన తర్వాత సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సీనియర్ ప్లేయర్ లేదా కోచ్ యొక్క సహకారంతో పే అండ్ ప్లే పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణా శిబిరాలను అండర్ 14 బాలబాలికలు ఉపయోగించుకునే విధంగా తల్లిదండ్రులు, పిల్లలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఇతర సమాచారం నిమిత్తం 9676638201 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పని ప్రదేశాల్లో భద్రతా ఉపకరణాలు ధరించాలి

- తెలంగాణ కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణి కుముదిని

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పని ప్రదేశాల్లో కార్మికులు భద్రతా ఉపకరణాలను ధరించాలని తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని సూచించారు. ప్రపంచ పని భద్రత-ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో శనివారం పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాణి కుముదిని మాట్లాడుతూ కార్మికులు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యూలాండ్ లేబొరేటరీస్ లిమిటెడ్ వైస్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుచేత్‌రావు మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రత ప్రమాణాలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. తెలంగాణ పరిశ్రమల డైరెక్టర్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ స్టేట్ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాల్‌రావు మాట్లాడుతూ కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వారికి ముందస్తు అవగాహన కల్పించాలన్నారు. ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వై.మోహన్‌బాబు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కార్మికులు వేడి ఒత్తిడిని ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

చేవెళ్ల భవిష్యత్తుకు నాదీ భరోసా

- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్/పూడూరు/పరిగి/కులకచర్ల, ఏప్రిల్ 29: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని భవిష్యత్తులో అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేని బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో సోమవారం బీజేపీ యువ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలోని యువతి యువకులకు ఉపాధి మార్గం చూపే బాధ్యత తనదన్నారు. నరేంద్రమోడీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపు నిచ్చారు. యువతకు ఆదర్శంగా నిలవాల్సిన రాహుల్‌గాంధీ యూపీలో పోటీచేయలేక పారిపోయాడని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్, నాయకులు వివేకానందారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, రాజు, పలువురు యువ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరులో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ వస్తున్న ప్రజాదరణ చూసి కాంగ్రెస్‌కు నిద్రపట్టడంలేదన్నారు. కాగా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి సోమవారం వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్ప, రామయ్యగూడ, ఎంబిజీ కాలనీల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మహిళంతా పెద్ద సంఖ్యలో పాల్గొని కమలపువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సూచించారు. ఆమె వెంట వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాదవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సుచరిత, శిరీష, పోకల సతీష్, కేపీరాజు పాల్గొన్నారు. అదేవిధంగా వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సంగీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పరిగిలో జరిగిన ఓబీసీల సమ్మేళనంలో పరిగిలో సోమవారం నిర్వహించిన ఓబీసీ సమ్మేళనంలో కొండా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి తనకు పోటీనే కాదన్నారు. రంజిత్‌రెడ్డి వ్యాపార సామ్రాజ్యాన్ని ధ్వంసం చేయాలంటే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శి వెన్నె ఈశ్వరప్పలు మాట్లాడుతూ బీజేపీ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. కులకచర్ల చౌరస్తాలో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలో ఆ పార్టీ నాయకులు సమాధానం ఇవ్వాలన్నారు. ధర్మానికి అబద్ధానికి జరుగుతున్న యుద్ధమే ఈ పార్లమెంట్ ఎన్నికలని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రహ్లాద్‌రావు, మారుతి కిరణ్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, సౌమ్యరెడ్డి, మైపాల్, గోవింద్ నాయక్, సురేశ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేద్దాం

వికారాబాద్ జిల్లా కేంద్రంలో మంద కృష్ణ మాదిగ తలపెట్టిన సభను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు కేఎస్. రత్నం పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్, బీజేపీ నాయకులతో కలిసి సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అక్రమంగా భూములు కబ్జా చేసిన చరిత్ర రంజిత్ రెడ్డిది అని విమర్శించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, బీజేపీ నాయకులు నందు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

యాలాల/ధారూరు: యాలాల మండలంలోని కోకట్, కమల్‌పూర్, నాగసమందర్ గ్రామాల్లో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామ యువత పెద్దఎత్తున బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నారాయణ శివకుమార్, యాదగిరి, మధు, అరుణ్ పాల్గొన్నారు. అదేవిధంగా ధారూరు మండలంలోని కేరెల్లిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, మండలాధ్యక్షుడు ఎం.రమేశ్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రాష్ట్రంలో 16 స్థానాల్లో బీజేపీ విజయం ఖాయం

తాండూరు: రాష్ట్రంలో బీజేపీ 16స్థానాల్లో విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. తాండూరులో సోమవారం నిర్వహించిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ నర్సింహులు, శివకుమార్, శాంత్‌కుమార్, లలిత, లావణ్య, బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు కొండాను గెలిపించాలి

చేవెళ్ల: మచ్చలేని నాయకుడు చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బిజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్కెపల్లి, ఈర్లపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, దేవుని శర్వలింగం, మధుకర్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, పార్టీ నాయకులు కార్యర్తలు ఉన్నారు.

కొండాకు అండగా గిరిజనులంతా ఏకం కావాలి

మహేశ్వరం: దేశ వ్యాప్తంగా గిరిజనులను సామాజికంగా, ఆర్థికంగా ముందుకు నడిపిస్తున్న ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమైందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. తుక్కుగూడలో ఏర్పాటు చేనసిన చేవెళ్ల పార్లమెంట్ స్థాయి గిరిజనమోర్చా సమావేశంలో వారు మాట్లాడారు.

సమాజసేవ చేయాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి, మాలతిరెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29: విద్యార్థులు చదువులో రాణిస్తూనే సమాజ సేవ చేయాలని మెగా, ఒమెగా విద్యాసంస్థల చైర్మన్ ఎన్.మోహన్‌రెడ్డి తెలిపారు. ఎదులాబాద్ ఒమెగా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను అధిరోహించాలని తెలిపారు. సమయపాలనతో ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు చేసిన సాంస్కృతిక, నృత్యప్రదర్శనలు, ర్యాంప్‌వాక్ ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెగా, ఒమెగా విద్యాసంస్థ వైస్ చైర్‌పర్సన్ కసిరెడ్డి మాలతిరెడ్డి, డైరెక్టర్ సంజనారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



సావనీరు విడుదల చేస్తున్న సూర్యదేవర నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29: ఉపాధ్యాయులు ఆంగ్ల భాషపై పట్టు సాధించి, విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా బోధించాలని అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ఆంగ్ల-ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్లు ముత్తారెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, అనంతలక్ష్మి, అనురాగ్ పల్లా, అధ్యాపకులు మహిపతి శ్రీనివాస్‌రావు, మద్ది శ్రీధర్ పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



బొంరాస్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 29: మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో సోమవారం కరపత్రాలతో ఇంటింటికి తిరిగి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బొంరాస్‌పేట్‌తో పాటు బురాన్‌పూర్, వడిచర్ల, దుప్‌చర్ల తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహులుగౌడ్, రాజేష్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, సంతోష్, నర్సింహులు పాల్గొన్నారు.

పెళ్లింట్లో మాజీ ఎమ్మెల్యే సందడి

బషీరాబాద్, ఏప్రిల్ 29: ఓ గిరిజనుడి పెళ్లింట్లో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సందడి చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బషీరాబాద్ మండలంలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే వాల్యానాయక్‌తండాలోని మాజీ ఎంపీటీసీ రథోడ్‌రాజు బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయబద్ధంగా నెత్తికి పెట్టుకునే తలపాగ(రూమలు)ను మాజీ ఎమ్మెల్యేతో పాటు, వెంట వచ్చిన నాయకులందరికీ పెట్టడంతో పెళ్లి పందిట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, నాయకులు పలువురు నూతన దంపతులు రథోడ్‌దశరథ్, రాజేశ్వరిలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రాజుగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు ఆశోక్‌గౌతం, పోలీస్‌నవీన్‌రెడ్డి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, ఏప్రిల్ 29: వెంకటాపూర్‌లో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భా గంగా ప్రత్యేక పూజలు, స్వామి వారి ఊరేగింపు, బ్రాహ్మణులు, దాతలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, వైస్ అంజన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, అర్చకులు, యాదగిరి నర్సింహశాస్త్రి, కామేశ్వరశాస్త్రి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణం

యాచారం, ఏప్రిల్ 29: మండలంలోని నక్కర్తమేడిపల్లి-నజ్దిక్‌సింగారంలో సోమవారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం పటం వేశారు. నూతన గొంగడిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఒగ్గు కళాకారులతో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు ఓడి బియ్యం పోశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. యాదవులు తమ ఇంటి ఆడపిల్లలకు నూతన వస్త్రాలు పెట్టి ఓడిబియ్యం పోశారు.

బీజేపీలో అన్నివర్గాలకు సముచిత స్థానం



ఘట్‌కేసర్ రూరల్: మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్/ మౌలాలి/వనస్థలిపురం, ఏప్రిల్ 29: బీజేపీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని కచవానిసింగారం, సుప్రభాత్‌టౌన్‌షిప్‌లో ఈటల సమక్షంలో మాజీ సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు, ప్రధానకార్యదర్శి ప్రభంజన్‌గౌడ్, కౌన్సిలర్ గొంగ్గళ్ళ మహేష్, నాయకులు అచ్చిని నర్సింహ్మ, బసవ రాజుగౌడ్, శివరాజ్‌గౌడ్, సురేష్, శంకర్, దినేష్ పాల్గొన్నారు. అదేవిధంగా మల్కాజిగిరికి చెందిన టీడీపీ నాయకులు, అడ్వకేట్ సుధీర్, ఫోరమ్ ఫర్ బెటర్ మల్కాజిగిరి ఉపాధ్యక్షుడు రాకేష్ తదితరులు ఈటల సమక్షంలో పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్‌యాదవ్, భాను, కృష పాల్గొన్నారు. అదేవిధంగా మౌలాలి డివిజన్‌లోని అక్షిత అపార్ట్‌మెంట్‌లో కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు అనిపెద్ది సాయిబాబు, నాయకులు లింగరావు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో చంద్రపురి కాలనీ సీనియర్ సిటిజన్ బిల్డింగ్‌లో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలకు పెద్దపీట వేసిందన్నారు. జరిగిందన్నారు. 370 ఆర్టికల్, అయోధ్య రామమందిరం నిర్మాణం, ప్రపంచ దేశాలు సైతం ప్రధాని మోదీని గౌరవించే స్థాయికి తీసుకరావడం గొప్పవిషయం అన్నారు. దేశానికి మళ్లీ ప్రధాని మోదీ కావాలంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, పలు కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీడి మెట్లలో ఈటలకు మద్దతుగా ప్రచారం

పేట్‌బషీరాబాద్/వనస్థలిపురం/మల్కాజిగిరి/రామంతాపూర్/మచ్చబొల్లారం (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయం 14 రోజులు ఉండడంతో నియోజకవర్గంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా జీడి మెట్ల డివిజన్‌లో బీజేపీ నాయకులు ప్రచారంలో జోరు పెంచారు. డివిజన్‌లోని వేంకటేశ్వ రకాలనీ ఈస్ట్, వేంకటేశ్వర కాలనీ వెస్ట్,న్యూ వివేకానందానగర్‌లో ఇంటింటా ప్రచారాన్ని మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి కార్యకర్తలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి,ప్రవీణ్‌రెడ్డి, ఉమాపతి, బాలరాజ్, ప్రసాద్‌శర్మ, రవీందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీఎన్‌రెడ్డినగర్‌లో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరుగుతు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా ఈటలకు మద్దతుగా ఓల్డ్ మిర్యాలగూడ లో సీనియర్ బీజేపీ నాయకులు ఉరపల్లి రాంబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా రామంతాపూర్ డివిజన్ 265 బూత్ పరిధిలో బూత్ అధ్యక్షుడు పదిగం బాలాజీ, కో ఆర్డినేటర్ నాగేష్‌ఆధ్వర్యంలో రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు మహిళా కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మచ్చబొల్లారంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా మీడియా కన్వీనర్ వై గోపి ఆధ్వర్యంలో మచ్చబొల్లారం డివిజన్ పలు కాలనీల్లో ప్రచారం చేశారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ పద్మిని ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. నిజాంపేట్‌లో నిర్వహించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా రోడ్‌షోకు మచ్చబొల్లారం డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కులకచర్ల, ఏప్రిల్ 29: కులకచర్ల మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నత్తనడకన బీటీ రోడ్డు పనులు' అనే కథనానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పందించారు. సంబంధిత అధికారులపై ఒత్తిడి తేవడంతో మూడు రోజులుగా బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం బొంరెడ్డిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1కోటి 20 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ అసెంబ్లీ ఎన్నికల ముందు కంకర వేసి పనులు నిలిపివేయడంతో గ్రామానికి వెళ్లే ప్రజలు, పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.



బొంరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పరిగి, ఏప్రిల్ 29: తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పరిధిలోని 6వ వార్డులో బోర్లు చెడిపోయి సరఫరా లేకపోవడాన్ని తెలుసుకుని సోమవారం చైర్మన్‌తోపాటు, కౌన్సిలర్ నాగేశ్వర్‌రావులు కలిసి దగ్గర ఉండి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. నీటిని వృథా చేసుకోకుండా వాడుకోవాలని సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నిదుల కొరత లేదని, ఏ కాలనీలోనైనా బోర్లు, పైపులైను వేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు గౌస్‌పాష, ఖలీల్, పురపాలక సిబ్బంది మహేందర్‌రెడ్డి, హుస్సేన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తాన్‌నగర్‌లో బోరు బాగు చేయించిన మున్సిపల్ చైర్మన్ అశోక్

పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

● వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి



వికారాబాద్, ఏప్రిల్ 29: ధారూరు మండలం, హరిదాస్‌పల్లి గ్రామానికి చెందిన గట్లపల్లి రాజు తన తండ్రి మృతి చెందిన ఘటనలో తనకు న్యాయం చేయడం లేదంటూ పోలీసు అధికారులపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి స్పష్టం చేశారు. రాజు తండ్రి చనిపోయిన ఘటనకు సంబంధించిన కేసు దర్యాప్తు దశలో ఉందన్నారు. న్యాయపరంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు. నిందితులను ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదంటూ ఆరోపణలు చేస్తూ రాజు డీఎస్పీ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని బెదిరింపులకు పాల్పడడాన్ని ఆయన తప్పుపట్టారు. పోలీసు అధికారులపై రాజు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు.

క్షేత్రస్థాయిలో పటిష్టంగా బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కులకచర్ల, ఏప్రిల్ 29: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పటిష్టంగానే ఉందని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. కులకచర్ల పీజేఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ఉమ్మడి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి గెలిచిందని, ప్రజలు ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో జరిగిన తప్పులు పునరావృతంకాకుండా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ప్రతీ కార్యకర్త గత ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాందాస్‌నాయక్, పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రాంచందర్‌రావు, యువ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగరాజు, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ల్యాండ్ గ్రాబర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 29: మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పేదల భూములు ఆక్రమించి లాక్కున్న ఒక పెద్ద ల్యాండ్ గ్రాబర్ అని మూడుచింతలపల్లి వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కొల్తూర్‌లో మండల అధ్యక్షుడు నర్సింహులుయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ రైతులతో మాట్లాడుతూ- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్ నాయకుల ఆటలు సాగక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆరోపణలు మానుకోవాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, యాదగిరి, భూపాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్‌రావు, నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

దౌల్తాబాద్, ఏప్రిల్ 29: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణకు మద్దతుగా బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని బాలంపేట, నాగసార్, తిరుమలపూర్ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సతీశ్ ముదిరాజ్, కుంద్రు నర్సిములు, త్రివిక్రంరెడ్డి, జంబులప్ప, అంజన్‌కుమార్, మొగులప్ప, సురేశ్, వెంకట్, దత్తు, మాణిక్యప్ప, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిరుమలపూర్‌లో ఉపాధిహామీ కూలీలతో బీజేపీ నాయకులు

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ.రాజు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్‌లోని ఖానాపూర్‌లో, ఇబ్రహీంపట్నం బృందావన్‌కాలనీలో సీఐఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు.



కాంగ్రెస్‌లో చేరిక

కీసర, ఏప్రిల్ 29: టీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చీర్యాల్ మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో ధర్మేందర్ తన అనుచరులతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డిలు ధర్మేందర్‌కు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సీనియారిటీ ప్రకారం బాధ్యతలు అప్పగించాలి



రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కొడంగల్, ఏప్రిల్ 29: ఎన్నికల్లో సీనియారిటీ ప్రకారం అన్ని ఉపాధ్యాయ సంఘాలవారికి నిస్పక్షపాతంగా బాధ్యతలు అప్పగించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారులకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉపాధ్యాయులందరికీ ఎస్‌జీటీల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నారని, ఇది పూర్తిగా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సంఘానికి అనుకూలంగా ఎన్నికల విధులు వేస్తున్నారని ఆరోపించారు. మండలంలో టీఎస్ యూటీఎఫ్ టీఎస్‌ఎస్‌టీయూ, టీపీయూఎస్, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు ఉన్నా కొడంగల్ మండలంలో పీఆర్‌టీయూ సంఘానికే ప్రాధాన్యత ఇస్తూ ఆ సంఘం సభ్యులకు ఎక్కువ విధులు వేస్తున్నట్లు తెలిపారు. పక్షపాతం లేకుండా అన్ని ఉపాధ్యాయ సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న బస్సు.. ఒకరు మృతి



ప్రమాదానికి గురైన బైక్

ధారూరు, ఏప్రిల్ 29: ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. మరో వ్యక్తి తీవ్రగాయాల పాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఈ ఘటన ధారూరు సమీపంలోని కత్వ వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ధారూరు దాటిన తర్వాత కత్వ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కావలి అనందం(35) అక్కడికక్కడే మృతిచెందగా అతడితో పాటు ఉన్న అదే గ్రామానికి చెందిన కావలి సాయికి తీవ్ర గాయాలై ప్రాణపాయస్థితిలో ఉన్నాడు. ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా బస్సు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా రోడ్డుకు ఎడమ వైపు నుంచి కుడివైపునకు బస్సును నడపించటంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.....ఉప్పల్‌కు చెందిన కొమ్మిడి అమృతరెడ్డి(62) తన భార్య కొమ్మిడి లలితతో కలిసి హోండా యాక్టివాపై ఈ నెల 27 పని నిమిత్తం భువనగిరికి బయలుదేరాడు. ఘట్‌కసర్ మండలం, అవుషాపూర్ బ్రిడ్జి సమీపంలో యాక్టివా అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో అమృతరెడ్డికి తీవ్రగాయాలు కాగా అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో అమృతరెడ్డిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైల్వార్ ఫారెస్ట్‌లో మంటలు



మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో దగ్ధమవుతున్న మొక్కలు

బషీరాబాద్, ఏప్రిల్ 29: మండలంలోని మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో సోమవారం మంటలు రేగాయి. నీళ్లపల్లి- మైల్వార్ మార్గం అటవీ ప్రాంతంలో రోడ్డుగుండా ఒకవైపు మంటలు రేగి చెట్లు దగ్ధమయ్యాయి. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యాసుందర్‌రావు, సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌ఖాన్ వెంటనే స్పందించారు. సెక్షన్ అధికారి ఘటనాస్థలానికి చేరుకుని సిబ్బందితో మంటలను ఆర్పించి అదుపులోకి తీసుకువచ్చారు. సకాలంలో స్పందించకుంటే అడవిలోకి మంటలు వ్యాపించేదని అధికారులు తెలిపారు.ఎక్కడబడితే అక్కడ మంటలు పెట్టవద్దని, సిగరెట్లు, బీడీలపీకలు అడవుల్లో పడేయొద్దని జనచైతన్య కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తున్నా ఫలితం లేకుండా పోతోందని ఫారెస్ట్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా గోలీసోడా తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 29: గడువు ముగిసిన ముడిసరుకుతో నిబంధనలకు విరుద్ధంగా గోలీసోడా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడకు చెందిన సల్ల సాయితేజ, ఎదులాబాద్‌లో కిరాణా దుకాణంను నిర్వహిస్తున్నాడు. అందులో ఆహారభద్రత పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా గోలీ సోడా తయారు చేస్తున్నట్లు సమాచారం తెలుసుకొని సోమవారం దాడి సోదాలు నిర్వహించారు. గోలీసోడాలో కలిపేందుకు గడువు ముగిసిన ముడిసరుకులను స్వాధీనం చేసుకున్నారు. ఆహార భద్రత ప్రమాణాలను పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా గోలీసోడా తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సాయితేజను అరెస్టుచేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై షైబెల్లి తెలిపిన వివ రాల ప్రకారం.. నాగన్‌పల్లికి చెందిన కొత్తరావుల జంగయ్య(55), కొత్తరావుల మల్లేష్(38) అన్నదమ్ములు. ఈ నెల 26న ఇబ్రహీంపట్నంలో తన బంధువుల ఎంగేజ్‌మెంట్‌లో పాల్గొన్నారు. అనంతరం రాత్రి ఇద్దరూ కలిసి బైక్ (ఏపీ29 బీడీ 3202)పై స్వగ్రామానికి వస్తుండగా ముకునూర్ సమీపంలో బీరప్పస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు నగరంలోని ఆసుపత్రికి తరలించగా జంగయ్య ఆదివారం రాత్రి మరణించాడు. మల్లేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

మంచాల, ఏప్రిల్ 29 : బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ సోమవారం రంగారెడ్డి జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. మంచాల సీఐ బబ్యానాయక్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. 2016లో లోయపల్లికి చెందిన బూడిద బాలనర్సింహ(43) బంధు వు ఇంటికి వచ్చిన మానసిక పరిస్థితి సరిగాలేని బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ గంగాధర్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం పోక్సో చట్టం ప్రకారం ఎల్‌బీనగర్ 9వ అదనపు కోర్టు నిందితుడికి 20సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తుదితీర్పు వెల్లడించింది. బాధితురాలికి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటిస్తూ బాధితురాలికి అందజేయాలని ఆదేశించింది.

మట్టి టిప్పర్ల పట్టివేత

యాచారం, ఏప్రిల్ 29: నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు మట్టితో వెలుతున్న మూడు టిప్పర్లను సోమవారం తెల్లవారుజామున యాచారం పోలీసులు పట్టుకున్నారు. మట్టి తరలింపునకు మైనింగ్ అనుమతి ఉందా లేదా అని విచారించాలని తహసీల్దార్‌కు అప్పగించామని సీఐ శంకర్‌కుమార్ తెలిపారు. దీనిపై తహసీల్దార్ అయ్యప్పను వివరణ కోరగా అనుమతి లేనందున ఒక్కో టిప్పర్‌కు రూ.2వేల జరిమానా విధించామని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు అరిగోస

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 29: కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తరఫున ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా రైతుల విన్నపం మేరకు గ్రామంలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తరువాత విద్యుత్ సరఫరా లేక రైతుల పంటలు ఎండిపోయి రోడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాక్షస పాలన పోయి కేసీఆర్ పాలన రావాలంటే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.